ఏటికొప్పాక హస్త కళారంగానికి మరింత చేయూత

- కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి
- కలెక్టర్ విజయకృష్ణన్
- ఆధునికతను అందిపుచ్చుకోవాలి
- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

- వార్త 8లో..



తొలిపావంచా వద్ద మంగళవారం రాత్రి కొబ్బరికాయ కొడుతున్న భక్తుడు



ఆశేషంగా వచ్చే భక్తుల కోసం తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటు చేసిన స్టాండ్లు

సింహగిరికి ఉత్సవ శోభ

- మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం
- అప్పన్న ప్రచార రథాన్ని ప్రారంభించనున్న దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు

నేడే గిరి ప్రదక్షిణ

- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు
- దారిపొడవునా తాగునీరు, వైద్య శిబిరాలు
- 3,000 మందితో బందోబస్తు

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

సింహ'గిరి ప్రదక్షిణ' బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్నది. కొండదిగువన తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, స్థానిక శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణలతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమిస్తారు.

ఏటా ఆషాఢ మాసంలో శుక్లపక్ష చతుర్దశినాడు లక్షలాది మంది కొండంత భక్తితో వరాహలక్ష్మీనృసింహస్వామి కొలువుదీరి ఉన్న సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆచారంగా వస్తోంది. భక్తులు కొండ దిగువన తొలిపావంచా వద్ద ప్రారంభించి అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, జోడుగుళ్లపాలెం, ఎం.వి.పి.డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, మాధవధార, మురళీనగర్, కుమారి కల్యాణ మండపం, పాతగోశాల మీదుగా సింహాచలం చేరుకుని (మొత్తం 32 కిలోమీటర్లు) ప్రదక్షిణ ముగిస్తారు. గిరి ప్రదక్షిణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లన్నీ పూర్తిచేసింది. తొలిపావంచా వద్ద మాత్రమే కాకుండా పురాతన భైరవద్వారం (పాత తొలిపావంచా) వద్ద కొబ్బరికాయలు కొట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది హాజరవుతారని భావించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రతి 6 కి.మీ.కు అధికారులతో బృందాన్ని పెట్టారు. ఎక్కడికక్కడ మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. ఏదైనా అవసరమైతే ఫోన్ ద్వారా చెప్పడానికి టోల్ ఫ్రీ నంబర్లను దారి పొడవునా డిస్‌ప్లే చేశారు. అలాగే ప్రదక్షిణ మార్గంలో 750 విద్యుద్దీపాలు ... మిగతా 8వ పేజీలో

సింహగిరి ప్రదక్షిణ.. భూప్రదక్షిణతో సమానం · 8లో



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానానికి గ్రీన్ సిగ్నల్

- స్పష్టత రావడంతో ప్రవేశాలకు ఏర్పాట్లు చేసుకుంటున్న కళాశాలల యాజమాన్యాలు
- త్వరలో డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

నర్సీపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి):

డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో డిగ్రీ ప్రవేశాలకు కూడా తెర తీసినట్టు అయింది. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సులు సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానమా?, డబుల్ మేజర్ సబ్జెక్టు విధానమా? అన్నది రెండు నెలలుగా డైలమాలో పడి డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఆన్‌లైన్ అడ్మిషన్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆఫ్ లైన్ చేయమని కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. అయితే ఆన్‌లైన్ అడ్మిషన్లకే ఉన్నత విద్యాశాఖ మొగ్గు చూపింది. ఈ ఏడాది డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం ఉండదని తేలడంతో కళాశాల యాజమాన్యాలు అడ్మిషన్లకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ సబ్జెక్టులు బీఏ హిస్టరీ 40 సీట్లు, బీఏ పొలిటికల్ సైన్స్ 40, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ 60, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 40, బీఎస్సీ బోటనీ 40, ఫిజిక్స్ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయి. ఈ వారంలో డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ వస్తుందని అధికారులు అంటున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ పెట్టుకునే సదుపాయలం కల్పిస్తామని ప్రిన్సిపాల్ ఎస్.రాజు తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహణ

- వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి చెరువుల నుంచి మట్టి తరలింపు
- పంచాయతీకి, ప్రభుత్వానికి పన్నులు చెల్లించని వారు ఎందరో..
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు



అనకాపల్లి మండలం కోడూరు నుంచి కొండుపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఇటుక బట్టీ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు మండలాల్లో ఇటుక బట్టీల నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతోంది. గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పన్ను ఎగవేస్తూ కొందరు నిర్వాహకులు యథేచ్ఛగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ సమీపంలో చెరువులు, ప్రభుత్వ గోర్జలు, పంట కాలువల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో ఇటుక బట్టీలు ఉన్నప్పటికీ ప్రధానంగా అనకాపల్లి, మునగపాక, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మండలాల్లో పెద్ద సంఖ్యలో ఇటుక బట్టీలున్నాయి. మండలాల్లో సుమారు 450 ఇటుక బట్టీలున్నాయి. వీటిలో సగానికిపైగా అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి. ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే నిబంధనల ప్రకారం పంచాయతీకి బట్టీలో తయారవుతున్న ఇటుకల సంఖ్య ఆధారంగా రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. లక్ష ఇటుకలు తయారు చేసే ఇటుకల బట్టీల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. వ్యాపార జీఎస్‌టీ పన్ను 5 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. బట్టీలో తయారు చేసిన ఇటుకలు కాల్చేందుకు పొల్యూషన్ అధికారుల అనుమతులు పొందాలి. అంతే కాకుండా గ్రామ పంచాయతీ, రెవెన్యూ, జల వనరుల శాఖ, భూగర్భ గనులు, అటవీ శాఖల అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే చాలా మంది ఇటుక బట్టీల నిర్వాహకులు ఇవేవీ పాటించడం లేదు. అనకాపల్లి, మునగపాక మండలాల్లో వందకు పైగా ఇటుక బట్టీలు ఉండగా, వాటిలో సగానికి పైగా కనీసం పంచాయతీ అనుమతి కూడా పొందలేదని తెలిసింది. మిగిలిన శాఖల అనుమతులు పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో అనకాపల్లి, సబ్బవరం, చోడవరం, మాడుగుల మండలాల నుంచి పెద్ద ఎత్తున లారీలు, వ్యానుల్లో లక్షల సంఖ్యలో ఇటుకలు విశాఖపట్నం, గాజువాక, పెందుర్తి వంటి ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. ఒక ఇటుక రూ.10 కాగా, దూరాన్ని బట్టి రూ.12 వరకు వసూలు చేస్తున్నారు. కొందరు ఇటుక బట్టీల నిర్వాహకులు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నా ప్రభుత్వానికి ఎటువంటి పన్ను చెల్లించడం లేదని తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిపై దృష్టి సారిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కలకలం రేపిన వైఎస్సార్ విగ్రహం

యూపీహెచ్‌సీ ఆవరణలో అర్ధరాత్రి వెలసిన వైనం

- వైసీపీ నాయకుల పనేనని అనుమానం
- కూటమి నాయకుల ఫిర్యాదుతో తొలగించిన జీవీఎంసీ అధికారులు



యూపీహెచ్‌సీ ఆవరణలో వైఎస్ విగ్రహాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

స్థానిక గవరపాలెం పల్లపువీధి జంక్షన్‌లోని యూపీహెచ్‌సీ ఆవరణలో సోమవారం అర్ధరాత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వెలసిన ఘటన కలకలం రేపింది. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో అర్ధరాత్రి వేళ సిమెంట్ దిమ్మలు కట్టి వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయడంతో స్థానికులు కంగుతిన్నారు. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం కూటమి నాయకులకు తెలియజేయడంతో వారు యూపీహెచ్‌సీ ఆవరణకు వచ్చారు. టీడీపీ 80వ వార్డు అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు దీనిపై జీవీఎంసీ అధికారులకు, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించారు. కూటమి నాయకుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ టీపీవో కనకారావు తన సిబ్బందితో వచ్చి ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ వైసీపీ నాయకులు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి అవమానం కలిగేలా అర్ధరాత్రి వేళ అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు చీకటి పనులు చేయడం అలవాటు అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇటువంటి విధానాలను మానుకోవాలన్నారు. జనసేన నాయకుడు దూలం గోపి మాట్లాడుతూ వైసీపీ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున అవమానం పడే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీవి కవ్వింపు చర్యలు

వైసీపీ శ్రేణులు తెలిసి మరీ అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమంటే కూటమి శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడడమేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘర్షణ వాతావరణాన్ని సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలన్నదే వైసీపీ శ్రేణుల వ్యూహమని అన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు

గమ్యాల కుదింపు · 8లో

ప్రసూతి సేవల్లో పురోగతి

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పెరిగిన ప్రసవాల సంఖ్య

- గత ఏడాది కంటే అధికంగా డెలివరీలు... తగ్గిన రిఫరల్స్
- ఓపీ సేవలు కూడా మెరుగు



నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రి



ప్రసూతి విభాగంలో ఏర్పాటు చేసిన స్కానింగ్ యూనిట్

నర్సీపట్నం, జూలై 8(ఆంధ్రజ్యోతి):

స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో నెలకు 350 నుంచి 400 ప్రసవాలతో రాష్ట్రంలో ప్రాంతీయ ఆస్పత్రి మొదటి స్థానంలో ఉండేది. ఓపీ విభాగంలో కూడా ప్రతీ రోజు 100 నుంచి 150 మంది సేవలు పొందేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గింది. నెలకు 200 నుంచి 250 డెలివరీలు మాత్రమే జరిగేవి. ఓపీకి వచ్చే గర్భిణులు సంఖ్య సగానికి పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి తరచూ సమీక్షలు చేస్తున్నారు. దీని వలన ఇప్పుడు మళ్లీ ప్రసవాల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ప్రసూతి కేసులు విశాఖపట్నానికి తరలించడం తగ్గింది. గతంలో రిఫరల్ కేసులు నెలకు సరాసరి 30 కేసులు ఉంటే, ఇప్పుడు పదికి తగ్గింది. ఆస్పత్రిలోనే పురుడు పోస్తున్నారు. 2024 సంవత్సరంలో జనవరి నుంచి జూన్ వరకు 182 కేసులు రిఫరల్ రాస్తే, ఈ సంవత్సరం అదే కాల పరిమితిలో కేవలం 50 కేసులు తరలించారు. గత ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 1,427 ప్రసవాలు చేస్తే, ఈ ఏడాది 1,475 డెలివరీలు చేశారు.

మెరుగుపడిన సౌకర్యాలు

ప్రసూతి విభాగంలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. లేబర్ రూమ్, ఓపీలో, ట్రయాజ్ విభాగంలో ఏసీలు అమర్చారు. తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రస్తుతం ఉన్న ముగ్గురు గైనికాలజిస్టులతో పాటు సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద కూడా ఓపీ చూస్తున్నారు. దీంతో ఓపీ క్రమేపీ పెరుగుతోంది. వచ్చిన ప్రతీ కేసు ఆస్పత్రిలో డెలివరీ చేస్తున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో తప్పితే రిఫరల్ రాయడం లేదు. సుఖ ప్రసవాలు చేస్తున్నారు. సిజేరియన్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ చేసి డెలివరీ చేయాలంటే రూ.40 వేలు తీసుకుంటున్నారు. పుట్టిన బిడ్డకు పచ్చకామెర్లు సోకితే ఫొటో థెరపీ బాక్సులో పెట్టాలంటే ప్రైవేటు ఆస్పత్రిలో రోజుకు రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో పిల్లల డాక్టర్ పర్యవేక్షణలో ఎస్ఎన్‌సీయూ వార్డులో ఫొటో థెరపీ బాక్సులో ఉంచి వైద్యం చేస్తున్నారు. తక్కువ బరువుతో పుట్టిన పిల్లల కోసం వార్మర్స్ అందుబాటులో ఉన్నాయి.

ప్రసవాలు, రిఫరల్ కేసుల వివరాలు

2024 జనవరి నెల నుంచి జూన్ వరకు ఆస్పత్రిలో 1,427 డెలివరీలు అయ్యాయి. వాటిలో 871 సుఖ ప్రసవాలు కాగా, 556 సిజేరియన్‌లు చేశారు. 182 కేసులు రిఫర్ ... మిగతా 8వ పేజీలో

23 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

- రైతులకు రాయితీపై పంపిణీ
- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు



యార్డును పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు ఇస్తున్న మోహన్‌రావు

నర్సీపట్నం అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని రైతులకు 23 వేల క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక వ్యవసాయ ఉప సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో రైతులు వరి నారుమడులను సిద్ధం చేస్తున్నారన్నారు. రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందజేస్తున్నామని చెప్పారు. 30-40 శాతం మంది రైతులు ఇప్పటికే వరి విత్తనాలను వేశారన్నారు. అలాగే 33 వేల టన్నులు యూరియా అవసరం అవుతుందని గుర్తించామని... మిగతా 8వ పేజీలో

బీఎన్ రోడ్డులో గోతుల పూడ్చివేత

ఎట్టకేలకు కదిలిన ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్

- న్యాయవాదులు కోర్టులో కేసు వేయడంతో తాత్కాలిక మరమ్మతులు



మేడివాడలో ఎక్స్‌కవేటర్‌తో బీఎన్ రోడ్డులోని గోతులు పూడుస్తున్న దృశ్యం

రావికమతం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

ఎట్టకేలకు బీఎన్ రోడ్డు మేడివాడ వద్ద చెరువును తలపించే భారీ గోతులను పూడ్చే చర్యలను కాంట్రాక్టర్ చేపట్టారు. బీఎన్ రోడ్డు చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు గత ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధికి అనుమతులు మంజూరయ్యాయి. అయితే అప్పట్లో నిధులు విడుదలకాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించి అసంపూర్తిగా నిలిపివేశారు. దీంతో రోడ్డు పొడవునా చెరువును తలపించే విధంగా పెద్ద గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఈ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ రోడ్డు మరింత దారుణంగా తయారై కనీసం ద్విచక్ర వాహనాలు రాలేని దుస్థితి నెలకొంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ... మిగతా 8వ పేజీలో

డిప్యూటీ తహశీల్దార్లకు తాత్కాలిక పదోన్నతులు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 17 మందికి పోస్టులు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న 17 మందికి తాత్కాలికంగా తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించి, వివిధ మండలాల్లో నియమించారు. విశాఖ జిల్లాలో ఇటీవల జరిగిన తహశీల్దార్ల బదిలీలలో కొందరు అధికారులు ఉన్నత స్థాయిలో పైరవీలు చేసి కీలక స్థానాలు దక్కించుకున్నారు. అయితే అక్కడ వారిని చేర్చుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులు అంగీకరించలేదు. మాట మాత్రం చెప్పకుండా వారిని ఎలా నియమిస్తారంటూ అడ్డం పడ్డారు. దాంతో కొందరు ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టలేకపోయారు. ఇప్పుడు ఆ స్థానాలను కూడా డిప్యూటీ తహశీల్దార్లతో భర్తీచేశారు. విశాఖ జిల్లాలో ఆనందపురం తహశీల్దార్‌గా సూరిశెట్టి శ్రీనుబాబును, గాజువాక తహశీల్దార్‌గా బాతుల శ్రీనివాసరావును, పెందుర్తికి ఎ.సంతోష్ కిరణ్‌ను నియమించారు. అదేవిధంగా అనకాపల్లికి పి.సత్యనారాయణను నియమించారు. మిగిలిన వారందరనీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో నియమించారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం

చైర్‌పర్సన్లుగా రాజబాబు(పాయకరావుపేట), కన్నబాబు(నామవరం), శ్రీనివాసరావు(శ్రీరాంపురం)

పాయకరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాయకరావుపేట పీఏసీఎస్‌కి పాల్తేరు గ్రామానికి చెందిన దేవవరపు అప్పారావు(రాజబాబు) చైర్‌పర్సన్‌గాను, పర్సన్స్‌గా కట్టా నూకరత్నం, కూలి నానాజీ నియమితులయ్యారు. అదేవిధంగా నామవరం పీఏసీఎస్‌కి గుంటపల్లికి చెందిన గెడ్డం కన్నబాబు చైర్‌పర్సన్‌గాను, పర్సన్స్‌గా పక్కుర్తి నూకరాజు, శ్రీరంగం వీరభద్రరావు నియమితులయ్యారు. శ్రీరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పెంటకోటకు చెందిన చిక్కాల శ్రీనివాసరావును, పర్సన్స్‌గా రావాడ గోవిందరెడ్డి, పల్లెల వెంకట సూర్యనారాయణలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాయకరావుపేట సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన దేవవరపు రాజబాబు హైదరాబాద్‌లో పరిశ్రమలకు చెందిన టెక్నోక్రాట్స్ అసోసియేషన్ కోశాధికారిగా, కూకట్‌పల్లి మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. ఈయన గతంలో శ్రీరాంపురం పీహెచ్‌సీ చైర్మన్‌గా పనిచేశారు. తనను చైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి దేవవరపు రాజబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.


హోం మంత్రి వంగలపూడి అనితకు బొకే అందజేస్తున్న రాజబాబు

కోటవురట్ల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా వేచలపు

కోటవురట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా పాములవాక గ్రామానికి చెందిన వేచలపు జనార్దన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే వేచలపు శ్రీరామ్మూర్తి తనయుడు జనార్దన్ మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడుగా గుర్తింపు పొందారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జనార్దన్ నియామకం పట్ల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, నాయకులు జానకి శ్రీనివాసరావు, జానకి హరిబాబు, కోటి, గంటేడ లోవరాజు, కసిరెడ్డి యేసు అభినందించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ రైతు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



వేచలపు జనార్దన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాయకరావుపేట రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి నారుమడిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని పాల్తేరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారుమడిలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు, జాగ్రతలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వ్యవసాయ సిబ్బంది కల్పన, రూప, రైతులు పాల్గొన్నారు.

మురకాడ, కట్టుబోలుల్లో..

రాంబిల్లి: మండలంలోని మురకాడ, కట్టుబోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవిబాబు ముంపునకు తట్టుకొనే వరిరకాలు, లక్షణాలు, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో సి.సుమంత రైతుసేవా కేంద్రాల్లో లభ్యమయ్యే రాగి, జొన్న, మినుములు, కొర్రలు, మినీకిట్లు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శిరీష, ఎంపీఈవో రామారావు, వీఏఏ ప్రశాంతి, సిబ్బంది శ్రీనివాస్, కుమారి, కనకరత్నం, హేమ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని గోకులపాడు, పెనుగొల్లు గ్రామాల వాటర్ ప్లాంట్‌లు, కొరుప్రోలు కాయిర్ పరిశ్రమలు, చినఉప్పలం ఆక్వా ప్రాంతాలు, గుడువాడ హేచరీస్, గెడ్డపాలెం ఐస్ ప్లాంట్, కొరుప్రోలు, అడ్డరోడ్డు తిమ్మాపురం, పెదగుమ్ములూరు, కోనవానిపాలెం, గుర్రాజుపేట, గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం, రేవుపోలవరం, చినఉప్పలం, కాపుల వాతాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇది చేతల ప్రభుత్వం : ప్రగడ


సుపరిపాలనలో తొలి అడుగు బ్రోచర్ అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మడుతూరు, దోసూరుల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఏమిటో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలనలోనే చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, రాజాన నానాజీ, కాండ్రేగుల అప్పారావు, దేశంశెట్టి వెంకటరమణ, తమరాన అప్పలనాయుడు, లాలం నాగేశ్వరరావు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, శనివాడ ఆనందరావు, దాసరి నర్సింగరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం మామిడివాడలో చిన్న, సన్నకారు రైతుల భూముల్లో పండ్లతోట పెంపకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు ఒక రైతు పొలంలో కొబ్బరి, పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా గోకివాడ పంచాయతీ క్షేత్ర సహాయకుడు నీరుకొండ అప్పారావును ఎమ్మెల్యే విజయకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయమాధవి, ఈవోపీఆర్డీ రాజు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బద్ది మహేష్, కొరెడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ మట్టా అప్పలనర్స, ఉపాధి ఏపీవో శ్రీనివాసరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

మండలంలోని పేకిళ్లపాలెం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కూటమి నేతలు పండ్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా 13 రకాల పండ్ల జాతులకు చెందిన 120 మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలోనేతలు గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీను, వరహాలరావు, లవుడు లోవరాజు, కరణం రవికుమార్ పాల్గొన్నారు.

కోటవురట్లలో..

రైతులకు దీర్ఘకాలిక ఆదాయం పొందేందుకు ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. మంగళవారం ఉపాధి హామీ పథకం కింద లింగాపురంలో పండ్ల తోటల పెంపకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో 38 మంది రైతులకు చెందిన 40 ఎకరాల్లో జీడీమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోర్టు, జామ, డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ రఘురామ్, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.


రాంబిల్లి: మామిడివాడలో మొక్క నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

పాయకరావుపేట రూరల్‌లో..

పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు అన్నారు. మంగళవారం మండలంలోని మంగవరం రెవెన్యూ పరిధిలోని రైతుల భూముల్లో పండ్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 24 మంది రైతులు 26 ఎకరాలలో పండ్ల తోటలు పెంపకానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఏపీవో నానిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మంగవరం ఛానల్ నీటి సంఘం అధ్యక్షుడు గూటూరు రామగోవిందు, టీడీపీ నాయకులు దేవవరపు ఆనంద్, కోనే కొండబాబు, దేవవరపు గోవిందు, సీతారాం, నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

హరిపాలెం పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఇమ్యూనైజేషన్ అధికారి


రోగులకు అందుతున్న సేవలను తెలుసుకుంటున్న చంద్రశేఖర్ దేవ్

అచ్యుతాపురం రూరల్, జూలై 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చంద్రశేఖర్ దేవ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను నేరుగా అడిగారు. అనంతరం పీహెచ్‌సీ స్థితిగతులను వైద్యాధికారి డాక్టర్ రవిబాబును అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో మలేరియా, టీబీ పరీక్షలపై టెక్నీషియన్, ఫార్మాసిస్టులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది, అనంతరం ఆశా కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలను చేశారు. మాతృశిశు సంరక్షణ సేవల లక్ష్యాలను శతశాతం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, సిబ్బంది రామలక్ష్మి, సునీత, ఉమా మహేష్, లక్ష్మి, శిరీష, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కారిడార్ రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వండి

» ఆర్డీవో వీవీ రమణకు వినతి


ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు మెరుగైన ప్యాకేజీతో ఆదుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో వీవీవీ రమణను రైతు సంఘం ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. చందనాడ, తమ్మయ్యపేట గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతుల సమస్యల గురించి వివరించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆర్డీవో రమణ చెప్పారు. ఆర్డీవోను కలిసిన వారిలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మణిరాజు, గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్, గొర్ల గోవింద్, బంగార్రాజు, తాతారావు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈవో

నక్కపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో కె.నరేశ్ చెప్పారు. మంగళవారం పెదబోదిగల్లం హెచ్ఎం జయశ్రీ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా పీటీఎం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్ష జరిపారు. గ్రామంలో పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపించామని ఉపాధ్యాయులు చెప్పారు. సమావేశంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, కుమారి, వి.పద్మావతి, నాగేశ్వరరావు, రమేశ్‌బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

కొన్ని కంపెనీల సహకారంతో మునగపాక అభివృద్ధి

మునగపాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొన్ని కంపెనీల భాగస్వామ్యంతో మునగపాకలో అభివృద్ధి పనులు జరిగాయని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌కు చెందిన ఒక కంపెనీ ఇటీవల కాలంలో రూ.35 లక్షలుతో సాగునీటి కాలువలకు రక్షణగోడలు, గేట్లు అమర్చిందని చెప్పారు. సమావేశంలో పెంటకోట సత్యనారాయణ, దాడి శివ, సూరిశెట్టి అప్పలనాయుడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాతర గడ్డిపై రైతులకు అవగాహన

రాంబిల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాతర గడ్డిని పశుగ్రాసంగా భద్రపరచుకోవచ్చని జిల్లా పశు వైద్యాధికారి బి.రామ్మోహనరావు అన్నారు. మండలంలోని హరిపురంలో మంగళవారం పశుగ్రాస క్షేత్రాన్ని సందర్శించిన ఆయన పాడిరైతులు పాతర గడ్డిని నిల్వ చేయడంపై అవగాహన కల్పించారు. పాడిరైతులకు పశుగ్రాసాల సాగు, పెంపకం, భద్రపరిచే విధానాలను తెలియజేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై పశుగ్రాస విత్తనాలను అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఏడీ సీహెచ్.ఎం.ఎం.గంగాధర్, రాంబిల్లి, పంచదార్ల వైద్యులు కె.రఘునాథ్, కె.మాధురి, గ్రామ పెద్దలు ధూళి రంగనాయకులు పాల్గొన్నారు.

సహకార పద్ధతితో అధిక లాభాలు

ఐసీఏఆర్ సంచాలకులు డాక్టర్ షేక్ ఎన్ మీరా



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఆర్ సంచాలకులు డాక్టర్ షేక్ ఎన్ మీరా

రాంబిల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక మాధ్యమాల ద్వారా సహకార పద్ధతిని వినియోగించుకుని వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్మకం సాగించడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని ఐసీఏఆర్ పదో ప్రాంత సంచాలకులు డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. మండలంలోని హరిపురంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రతినిధులు, అభ్యుదయ రైతులతో మంగళవారం జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వ్యవసాయ ఉత్పత్తులను సరైన విధానంలో విక్రయించడం ద్వారా అధిక గిట్టుబాటు ధరలను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంగప్ప, బీసీటీ కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, వ్యవసాయ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు బి.ముకుందరావు, శాస్త్రవేత్తలు బి.ముకుందరావు, టీఎస్ఎస్‌కే పాత్రో, శైలజ కుర్రా, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి


మునగపాకలో దివంగత సీఎం వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, వైసీపీ నేతలు

ఎలమంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్ చేశారు. స్వీట్లు పంచారు. ఎలమంచిలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎంపీపీ బోదెపు గోవింద, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా తదితర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కౌన్సిలర్లు, దాసరి కుమార్, త్రినాథ్, పి. సత్యనారాయణ, రాము, దాసరి గణేష్, సంతోష్, దూది నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి, దిమిలి గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైసీపీ నేతలు జి.శ్రీనిబాబు, పి.కిషోర్ , సెట్టెం సత్యనారాయణ, ఎన్‌వీఎస్ సూర్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ మండల యువజన అధ్యక్షుడు ధూళి వెంకి, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని కొండకర్ల, చీమలాపల్లి, వెదురువాడ, జగ్గన్నపేట, యర్రవరం, హరిపాలెం తదితర గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు కోట్ని శివ, నర్మాల కుమార్, కట్టుమూరి శ్రీను, బీవీ రమణ, గంగిరెడ్డి రాము, రవీంద్ర రాజు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సైతారుపేట, రేవుపోలవరం, గుడివాడ, గోకులపాడు వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, నాయకులు కర్రి సత్యనారాయణ, కొణతాల శ్రీనివాసరావు, బైపా శ్రీనివాసరావు, ధూళి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు, మల్లె లోవరాజు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసీపీ నేత వీసం రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, వైసీపీ నాయకులు మణిరాజు, పొడగట్ల వెంకటేశ్, కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి, ఎల్లేటి సత్యనారాయణ, అల్లాడ కొండబాబు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల జంక్షన్ వద్ద మంగళవారం వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ అదనపు కార్యదర్శి సాగి సీతబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, నాయకులు సాగిరామచంద్రరాజు, సిద్దాబత్తుల సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే కే వెంకటాపురంలో వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చిటికెల వెంకట్, రమణ, వరహాలబాబు, చామంతుల శ్రీనివాసరావు, సూరి శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మునగపాకలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, నాయకులు సూరిశెట్టి రాము, మద్దాల వీరునాయుడు, నరాలశెట్టి సూర్యనారాయణ, బొద్దపు శ్రీరామ్మూర్తి, ఆడారి కాశిబాబు, కోనపల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని సత్యవరంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అదేవిధంగా మంగవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, అరట్లకోట తదితర గ్రామాలలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు సఖిలేటి రాము, పన్నీరు పాపారావు, తమిర్సి సత్యనారాయణ, కొంతం దివాణం, చోడిపల్లి శ్రీనివాసరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, తిమిర్సి గంగారావు, పడాల కృష్ణ, కర్రి వీరబాబు, పాలపర్తి సతీశ్ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం ఎదుట వైఎస్ఆర్ విగ్రహానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆదర్శ రైతులు దాడి తాతారావు, పోసిన అప్పారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, ధనిశెట్టి బాబి, దగ్గుపల్లి సాయిబాబా, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, సుందర లత, గెడ్డమూరి శ్రీనివాసరావు, పన్నీరు పాపారావు, కొంతం నరేష్, పల్యాల లచ్చబాబు, దోమాడ సుందరరావు పాల్గొన్నారు.

'విద్యా సంస్థల సమీపంలో నిషేధిక పదార్థాలు విక్రయించరాదు'

ఎస్.రాయవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలకు సమీపంలో ఉన్న పాన్‌షాపుల్లో నిషేధిత పదార్థాలతో పాటు సిగరెట్లు వంటివి విక్రయించినా, ధూమపానం చేసినా చర్యలు తప్పవని ఎస్ఐ విభీషణరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు సమీపంలో ఉన్న పలు పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి, సిగరెట్లు విక్రయిస్తున్న మూడు షాపులకు జరిమాన విధించారు.

గూడుపమ్మకు వెండి ఆభరణాల బహూకరణ


వెండి ఆభరణాలను బహూకరిస్తున్న దాతలు

నక్కపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గ్రామంలోని గూడుపమ్మ ఆలయానికి కాకినాడ జిల్లా నాగులాపల్లికి చెందిన భక్త కుటుంబం రూ.లక్ష విలువైన వెండి ఆభరణాలను మంగళవారం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజుకు అందజేశారు. నాగులాపల్లికి చెందిన అనిశెట్టి సుబ్బిరెడ్డి, సునీతాకుమారి, సత్యానందరెడ్డి,ఈశ్వరి దంపతులు వెండి త్రిశూలం, కుంకుమ భరిణి ఆలయానికి అందజేశారు. ఈ కొత్త ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు.

11 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ


ఎలమంచిలిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ అతిథిగృహం ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే విజయకుమార్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ.4 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నేతలు జె.శ్రీను, కర్రి యూన్సీ లంక రాజు, ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిల కోసం విద్యార్థుల ఆందోళన

ఎలమంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్ షిప్పుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి, తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు ఆరు త్రైమాసికల ఫీజు బకాయిలు, హాస్టల్ మెయింటెన్స్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని డీటీ వినయ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కే మణికంఠ, రవి, అజయ్, అంజి, భవానీ, దుర్గా, పావని పాల్గొన్నారు.



ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

10న గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

మునగపాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 10వ తేదీన గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మునగపాకలో సద్గురు షిర్డీసాయి మందిరం, తోటాడలో ఆదినారాయణస్వామి రాజయోగాశ్రమం, నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

జీడిమామిడి తోటలతో అధిక ఆదాయం


సీతానగరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు/కశింకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి మొక్కలు నాటడం ద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి మండలంలోని సీతానగరం, కశింకోట మండలంలోని ఉగ్గినపాలెం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మొక్కలు పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీడిమామిడి, కొబ్బరి మొక్కలను నాటారు. అనంతరం ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ అనకాపల్లి మండలంలోని 33 ఎకరాల్లో 1100 కొబ్బరి, జీడి, మామిడి మొక్కలు అందిస్తున్నామన్నారు. చిన్న, సన్నకారు రైతులు తమ భూముల్లో పండ్ల మొక్కలు వేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటైన తరువాత రైతులకు అవసరమైన గోకులాలు, పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పండ్ల తోటల పెంపకంపై దృష్టిసారిస్తే చిన్న, సన్నకారు రైతుల ఆదాయం మరింత పెరుగుతుందన్నారు.

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఉగ్గినపాలెంలో మొక్కలు నాటిన కొణతాల, పీలా, బుద్ద


ఉగ్గినపాలెంలో కొబ్బరి మొక్క నాటుతున్న కొణతాల, పక్కన పీలా, బుద్ద

ఈ కార్యక్రమాల్లో డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మణికుమార్, ఎంపీడీవోలు రవికుమార్, ఆశాజ్యోతి, మండల వ్యవసాయాధికారిణి స్వప్న, ఏపీవో సుప్రియ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, పచ్చికూర రాము, జి.జగదీశ్, బొబ్బది రమణ, టి.ప్రకాశ్, ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళీ, కలగ గోవింద, కలగ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే పంచకర్ల


ఆరిపాకలో కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని ఆరిపాక గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను పెద్ద ఎత్తున ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. సబ్బవరం మండలానికి 75 ఎకరాల్లో రైతులు కొబ్బరి, పండ్ల మొక్కలు నాటుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. మొక్కల సంరక్షణకు రైతుకు ఏడాదికి ప్రభుత్వం రూ.40 వేలు ఇస్తుందన్నారు. చిన్న, మధ్యతరగతి ప్రాజెక్టులన్నీ ఈ నాలుగేళ్లలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సాగునీరు పుష్కలంగా అందితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వసంతకుమార్, వైస్ ఎంపీపీ-1 లక్ష్మీరాణి, కూటమి నాయకులు ఇందలి రమణ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.రాము, శంకరరావు, ఆడారి నాగరాజు, కాళ్ల శ్రీను, వెంకట్, చినరాజు, కర్రి కనకరాజు, దొడ్డి శ్రీను, బైలపూడి దేముడుబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీపాలెంలో పాల సంఘం ఎన్నికలు

కశింకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనగుంటపాలెం గ్రామంలో మంగళవారం పాల సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలో మొదటి రెండేళ్ల పాటు అధ్యక్షుడిగా గౌతు బాబూరావు, తర్వాత మూడేళ్ల పాటు కలిగెట్ల సంజీవిని పాల ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే డైరెక్టర్లుగా ధనంరెడ్డి పార్వతి, కాయల లక్ష్మి, చిక్కాల నూకరాజు, కాయల బాబూరావు, టి.సత్యనారాయణ, ఎన్.నరసింహరావులను ఎన్నుకున్నారు.

కార్పొరేషన్ రుణాలు అందించాలి

తుమ్మపాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారులకు కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు రూ.2 లక్షలకు తగ్గకుండా రాయితీపై అందించాలని, 50 ఏళ్లు నిండిన చేతి వృత్తిదారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం నేతలు గొర్లి వెంకటేశ్వర్లు, ఎ.కోటేశ్వరరావు, జి.నాగభూషణం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

పరవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో మేలు చేకూర్చుతాయని వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి చెప్పారు. పరవాడ, గొర్లివాని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతం తయారీతో పాటు విత్తనశుద్ధి గురించి వివరించారు. కూరగాయల పంటలు, చిరుధాన్యాల సాగులో విత్తనశుద్ధి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మూర్తి, వీఏఏలు గౌతమి, జ్యోతి, ఏపీ సీఎన్ఎఫ్, ఎన్ఎఫ్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

కశింకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డెంగ్యూపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు నీటి నిల్వలు తొలగించాలని కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు సూచించారు. ఎవరికైనా 102 డిగ్రీల కంటే జ్వరం, తలనొప్పి, కీళ్లు, కండరాలు నొప్పులు ఉంటే వెంటనే ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అంతకాపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

సబ్బవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా సబ్బవరపు మనోహర్ గాంధీ, ఉపాధ్యక్షుడిగా ఒమ్మి ఉదయ్, ప్రధాన కార్యదర్శిగా మిడతాడ ఈశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడిగా నిరుజోగుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బోకం తాతంనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గొటివాడ గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా నీటిపల్లి కనక ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మినాయుడు, మాజీ సర్పంచ్ రొంగలి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి

సబ్బవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పేదరిక నిర్మూలన, పంచాయతీలలో జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగునీరు, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, సుపరిపాలన తదితర తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయతీల పనితీరును ప్రభుత్వం మదింపు చేసిందన్నారు. గ్రామాల సుస్థిర అభివృద్ధిపై నిర్వహిస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శివనారాయణ, కార్యదర్శి రాజేశ్వరరావు, వీఆర్వోలు, వెటర్నరీ అసిస్టెంట్లు, వీఏఏలు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చిందన్నారు. ఎన్నో త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దయి, వాటి స్థానంలో కార్మికవర్గానికి కీడు చేసే లేబర్‌కోడ్‌లు తీసుకురావడం దారుణమన్నారు. ఈ కారణంగా కార్మిక సంఘం పెట్టుకునే హక్కుతో పాటు యాజమానులతో మాట్లాడే హక్కును కోల్పోతున్నారన్నారు. ఇందుకు నిరసనగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

డ్రాపౌట్స్‌కు ఓపెన్ స్కూల్ చక్కని అవకాశం

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



బ్యానర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీఈవో

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో చదువుకు దూరమై మరలా చదువు కొనసాగించాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ ఒక చక్కని అవకాశమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్ 2025-2026 విద్యా సంవత్సరం ప్రవేశ ప్రకటన, కరపత్రాలు, బ్యానర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లు నిండిన వారంతా పదో తరగతిలో చేరి సెలవు దినాల్లో శిక్షణ పొంది పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చునన్నారు. అలాగే పదో తరగతి ఉత్తీర్ణులై కళాశాలలో చేరకుండా ఉండిపోయిన వారు, మధ్యలో మానేసిన వారు ఇప్పుడు నేరుగా ఆసక్తి ఉన్న సబ్జెక్టులలో ఇంటర్‌లో చేరవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆభరణాల బహూకరణ


చైర్మన్ గోవిందరావుకు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

పరవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన లక్ష్మీదేవి, గోదాదేవి అమ్మవార్లకు పలువురు భక్తులు బంగారం, వెండి ఆభరణాలను మంగళవారం బహూకరించారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరానిక చెందిన పి.వెంకట పద్మనాభరాజు ఒక గ్రాము బంగారం కిరీటాలు, హారాలు, శంఖు చక్రాలు, మండపేటకు చెందిన కింతాడ లోవరాజు వెండితో తయారు చేసిన నేత్రాలు, విశాఖపట్నం 104 ఏరియాకు చెందిన అప్పాడి మంగేశ్‌సాయి, జయ సత్యమాధురి దంపతులు బంగారు ముక్కుపుడక ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామగోవిందరావుకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు హరికృష్ణామాచార్యులు ఈ ఆభరణాలను అమ్మవార్లకు అలంకరించారు.

దుకాణాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో మంగళవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. విద్యా సంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న 20 దుకాణాల యజమానులపై సెక్షన్ 6ఏ కింద రూ.200 చొప్పున జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు. విద్యా సంస్థల పరిసరాల్లో వంద మీటర్ల లోపు ఎటువంటి పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానంగా 18 ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది, ఈగల్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కశింకోటలో...


కశింకోటలోని దుకాణంలో తనిఖీలు చేస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు కిరాణా, పాన్ షాపులలో సీఐ అల్లు స్వామినాయుడు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల పరిసరాల్లో సిగరెట్లు, పాన్ మసాలాలు, గుట్కా తదితర మాదక ద్రవ్యాలను విక్రయించకూడదని, నిబంధనలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా రక్షించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు.

విద్యుత్ చార్జీలు పెంచొద్దు

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు యోచనను కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 40 పైసలు చొప్పున వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన ఇంధన సర్దుబాటు చార్జీలు రూ.2,787 కోట్లు తిరిగి చెల్లించాలని కోరారు. తప్పుడు లెక్కలు ఇచ్చి అదనపు చార్జీలు వసూలు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులపై చార్జీల భారం మోపే ప్రతిపాదనలను విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్ని వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

ఉత్సాహంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గవరపాలెం దిబ్బవీధిలో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుద్ద మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీస్ కార్పొరేషన్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పథకాలు అందని వారు వార్డుల్లోని నాయకుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, మళ్ల గణేశ్, పి.రమణారావు, ఆళ్ల గోవింద, ఎం.అప్పారావు, భీశెట్టి ప్రసన్న, మళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పట్టణంలోని 81వ వార్డు నిదానందొడ్డిలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఎన్నికల హామీల ప్రకారం సూపర్ సిక్స్ పథకాల్లో 70 శాతం అమలు చేసినట్టు సురేంద్ర వివరించారు. నాయకులు పి.శ్రీనివాసరావు, ఎస్.శాంతారాం, భాను చందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



దిబ్బవీధిలో మహిళలకు పథకాలను వివరిస్తున్న బుద్ద... తుమ్మపాలలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న పీలా

తుమ్మపాల, సంతపాలెంలో పీలా పర్యటన

తుమ్మపాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల, సంతపాలెం గ్రామాల్లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం సంతపాలెంలో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు పెదిరెడ్ల గోవిందా, శెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.


బలిజపాలెంలో పథకాల కరపత్రాలు అందజేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరంలో...

సబ్బవరం: మండలంలోని ఎం.నాయుడుపాలెం, సబ్బవరం, నారపాడు, నల్లరేగులుపాలెం, బలిజ పాలెం, అమ్ములపాలెం గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, నియోజకవర్గ పరిశీలకుడు కోరాడ రాజబాబు పార్టీ శ్రేణులతో ర్యాలీలు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. శాప్ డైరెక్టర్ వీబీవీఎస్ఎన్ రాజు, నాయకులు జి.ముత్యాలనాయుడు, జి.వంశీదీప్, జి.దేముడు, సాయినాథరావు, ఆర్.శ్రీను, కె.గోవింద, ఎ.నాగరాజు, బర్ల రమణ, ఎల్లాజీ, బొండా కల్యాణ్, కోరాడ శ్రీను, పల్ల తాతారావు పాల్గొన్నారు.

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల/సబ్బవరం/పరవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజశేఖరరెడ్డి చేపట్టిన కార్యక్రమాలను కొనియాడారు. అలాగే పలు చోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలో కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మలపురెడ్డి కోటేశ్వరరావు, నాయకులు కాళ్ల సత్యనారాయణ, కత్తెర శ్రీధర్, ఆదిబాబు, బి.కిశోర్, బి.బాలమురళీ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కేక్ కట్ చేసి నేతలకు తినిపించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు రక్తదానం చేశారు. అనంతరం చిన నాలుగురోడ్ల జంక్షన్, పూడిమడక రోడ్డులోని బైపాస్ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నాయకులు ఎం.జానకిరామరాజు, ఎం.కిశోర్, ఎం.బుల్లిబాబు, వి.సత్యనారాయణ, గోవింద్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో వైఎస్సార్ విగ్రహానికి ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ స్టేట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలు, సంక్షేమం మరువలేమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం జన్మదిన కేకును కట్ చేసి అందరికీ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, నాయకులు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ఆర్ జయంతి కేకును కట్ చేసి భరత్‌కు తినిపిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

సబ్బవరంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పి.రవికుమార్, బి.రామునాయుడు, కె.రాము, పి.సురేశ్‌రాజ్, వి.అప్పలరాజు, డి.శ్రీను, బీఎం నాయుడు, పి.రమేశ్‌నాయుడు, బుజ్జి, దుర్గా, రాజు, చిన్నారావు పాల్గొన్నారు. మండల కేంద్రంల పరవాడలోని సంతబయలు వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సేవా కార్యక్రమాలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, వైసీపీ నాయకులు బూస అప్పలరాజు, చుక్క రామునాయుడు, గండి రవికుమార్, బొద్దపు చిన్నారావు, గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, వెన్నెల అప్పారావు, కూండ్రపు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

▸▸ అనకాపల్లి మునిసిపల్ జోనల్ కమిషనర్ చక్రవర్తి


కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తామని జీవీఎంసీ జోన్ నూతన కమిషనర్ కె.చక్రవర్తి చెప్పారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా బీవీ రమణ వ్యవహరించారు. ఇటీవల కాలంలో చక్రవర్తిని ప్రభుత్వం జోనల్ కమిషనర్‌గా నియమించడంతో మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల సూచనల మేరకు అనకాపల్లి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే దోమల బెడద లేకుండా ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయించి ఫాగింగ్ చేయిస్తామన్నారు. ప్రజలు డెంగ్యూ, మలేరియా బారిన పడకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించి అసంపూర్తిగా నిలిచిపోయిన స్టేషన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిసారించి, పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. అలాగే జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ఏళ్ల తరబడి ఉన్న డంపింగ్ యార్డు తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

అంతకు ముందు మునిసిపల్ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ చక్రవర్తి స్పష్టం చేశారు. అలాగే ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగం చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.


దేవునిగుమ్మంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు


ఉత్సవమూర్తులకు బేడా సేవ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో పూజలు చేసిన అనంతరం, ఉత్సవమూర్తులను బేడా మండపం చుట్టూ స్వామివారికి బేడా సేవా నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను ఆలయ ఈవో బి.మురళీ సత్కరించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సభ్యుల సంకీర్తనలు, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సభ్యులు గోలి మురళీ, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సిహెచ్.నూకరాజు, అర్చకులు పులకండం ప్రసాద్‌బాబు, పులకండం రాజేశ్ పాల్గొన్నారు.

అరుంధతినగర్ ఆస్పత్రి బోర్డుపై జగన్ ఫొటో..!

ప్రభుత్వం మారినా బోర్డు మార్చని అధికారులు



అనకాపల్లి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఫొటో పథకాలతో రూపొందించినవే దర్శనమివ్వడం విశేషం. రెండేళ్ల క్రితం అరుంధతినగర్ వద్ద డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆ బోర్డుతో పాటు గోడకు నవరత్నాల పథకాలతో జగన్ ఫొటోను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా వైద్యాధికారులు మాత్రం జగన్ ఫొటో ఉన్న బోర్డును తొలగించకపోవడం విమర్శలు తావిస్తోంది. మంగళవారం ఆసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు ఈ ఫొటోను చూసి నివ్వెరపోయారు. తక్షణమే జగన్ ఫొటో ఉన్న బోర్డును తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేస్తామని 80వ వార్డు ఇన్‌చార్జి జోగినాయుడు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు ఎస్పీ అమిత్ బర్దార్ హితవు


పాడేరు డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితాలు పాడవుతాయని ఎస్పీ హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు పట్టుదలగా చదువుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలిసినవారికి చెప్పాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే అధ్యాపకుల ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, డీఎస్పీ షహబాజ్ అహ్మద్, సీఐ దీనబంధు, ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి గౌరిశంకరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై గిరిజనుడి వినూత్న నిరసన


రెవెన్యూ హెచ్చరిక బోర్డుతోనే కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న రంధి చిన్నయ్య

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఓ గిరిజనుడు సోమవారం కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. మండలంలో గుత్తులపుట్టు సంతబయలులో ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా ఆక్రమిస్తున్నారు. వాటిపై స్థానిక గిరిజనుడు రంధి చిన్నయ్య 2023లో అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో, ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ఆక్రమణలు అరికట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది. క్రమంగా వ్యవహారం సద్దుమణగడంతో రెవెన్యూ యంత్రాంగం పెట్టిన హెచ్చరిక బోర్డును కూడా తీసేసి ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడం వల్లే ఇలా జరిగిందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రంధి చిన్నయ్య, గతంలో రెవెన్యూ అధికారులు పెట్టిన హెచ్చరిక బోర్డుతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను సైతం రెవెన్యూ అధికారులు అమలు చేయకుండా ఆక్రమణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని చిన్నయ్య డిమాండ్ చేస్తున్నారు.

జూనియర్ కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరం


బాలిక రక్త నమూనా తీస్తున్న వైద్య సిబ్బంది

సీలేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్‌కె మస్తాన్‌వల్లీ సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మంగళవారం జీకేవీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికార్ల ఆదేశాల మేరకు దీన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి మస్తాన్‌వల్లీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసు, హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి

ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పీఏఐ(ఫై) వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్థానిక ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయం ఉద్యోగులతో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 27 ప్రభుత్వశాఖలు పంచాయతీ పరిధిలో 2023-24 లో చేపట్టాల్సిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ఈ లక్ష్యాల పురోగతి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయడం ద్వారా పంచాయతీ స్థితి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలుస్తుందన్నారు. ఈ సూచిక ఆధారంగా పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తారన్నారు. ఈ వివరాలను సకాలంలో వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ వి. శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.

సర్వీసు వాహనాల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వర ప్రసాద్

గూడెంకొత్తవీధి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సర్వీసు వాహనాల డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ప్రైవేటు వాహనాల యజమానులు, డ్రైవర్లతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు సర్వీసు వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించరాదన్నారు. అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. వాహనాలకు కచ్చితంగా రికార్డు అప్‌టూడేట్‌గా ఉండాలన్నారు. ఇన్సూరెన్స్, సీ-బుక్, సర్వీసు ట్యాక్స్ తోపాటూ వాహనాలు నడుపుతున్న వ్యక్తులకు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులేని వ్యక్తులు వాహనాలు నడిపితే సంబంధిత వ్యక్తితోపాటూ యజమానిపై కూడా కేసులు పెడతామన్నారు. ద్విచక్రవాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పలసూరి పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి: పాండురాజు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల పరిశీలకులు పాండురాజు

ముంచంగిపుట్టు, జులై 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం బలోపేతానికి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఎంతో అవసరమని ఆ పార్టీ మండల పరిశీలకులు వి.పాండురాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఏనుగురాయి, వనభసింగి పంచాయతీలలో టీడీపీ నూతన పంచాయతీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఏనుగురాయి పంచాయతీ పార్టీ అధ్యక్షులుగా ముకుందపాడాల్, కార్యదర్శిగా కె.రాధాకృష్ణ, వనభసింగి పంచాయతీ అధ్యక్షులుగా డి.తిరుపతిరావు, కార్యదర్శిగా బి.ధనుర్జయ్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు, బూత్, యూనిట్ ఇంచార్జ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు 23 పంచాయతీల పరిధిలో పార్టీ నూతన పంచాయతీ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల పార్టీ పరిశీలకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కె.బలరాం, కార్యదర్శి కె.జగత్‌రాయ్, ఉపాధ్యక్షులు బాబూజీ, అసెంబ్లీ మహిళా అధ్యక్షులు కె.సన్యాసమ్మ, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి ఎ.తిరుపతిరావు, సర్పంచులు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, నేతలు రామస్వామి, చిన్నిబాబు శంకర్, చిన్ని సీతారాం తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


కొయ్యూరుకు చెందిన రైతు భూమిలో కొబ్బరి మొక్క నాటుతున్న నాయకులు, అధికారులు

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపు

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీసీసీ డీఎం కార్యాలయంలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమైన పచ్చదనం పెంపునకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలను శ్రద్ధతో సంరక్షించాలన్నారు. విద్యాలయాలతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మొక్కలు నాటాలన్నారు. గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం కృష్ణప్రసాద్, టీడీపీ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణ, సూర్యకాంతం, అచ్చిబాబు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం

కొయ్యూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) ప్రతీ రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఆశయంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సహిస్తున్నదని, దీన్ని సద్వినియోగపర్చుకోవాలని అధికారులు, నేతలు సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని కొయ్యూరులోని ఓ రైతు భూమిలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో అప్పలరాజుల ఆధ్వర్యంలో కూటమి నాయకులు మంగళవారం పండ్ల మొక్కలు నాటి ప్రారంభించారు. ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వ నిర్దేశిత పండ్ల తోటల పెంపకానికి 1,125 మంది రైతులకు చెందిన 1,250 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని పథకం ప్రోగ్రాం అధికారి, ఎంపీడీవో జీడీవీ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు బబీర్‌ఖాన్ తోట దొరబాబు, మేడిబోయిన చిన్న సాగిన బుజ్జిబాబు, మేడిబోయిన సత్తిబాబు, లక్ష్మణ్, రాజేంద్రపాలెం, కొయ్యూరు సర్పంచులు సింహాచలం, బాలరాజు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి మేలు

డుంబ్రిగుడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఫలసాయమిచ్చే పంటల సాగు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని బల్లుగుడ సర్పంచి వెంకటరావు అన్నారు. ఉపాధి పథకం ద్వారా మొక్కల పంపిణీ చేపట్టారు. గిరిజనుల సాగు భూముల్లో మొక్కలను నాటారు. పండ్ల తోటల పెంపకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికులు పాల్గొన్నారు.

క్షయ నియంత్రణకు పని చేద్దాం

జిల్లా ప్రోగ్రాం అధికారి రవికిరణ్ పిలుపు


పెదబయలు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎల్ఏటీవో కిరణ్

పెదబయలు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పరిధిలో క్షయను నియంత్రించడమే లక్ష్యంగా అందరూ పని చేద్దామని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్, కుష్ఠు, ఎయిడ్స్ క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెదబయలు, గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశ డే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్షయరహిత భారత్ అభియాన్‌లో సామాజిక ఆరోగ్య అధికారుల పాత్ర ముఖ్యమని తెలిపారు. ప్రతీ అనుమానితుని పరీక్షించి సక్రమంగా చికిత్స చేయాలన్నారు. మండల టి.బి. యూనిట్ ఎస్‌టీఏస్‌లు గుర్తించిన రోగుల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కిట్లను సకాలంలో పంపిణీ చేయాలని చెప్పారు. సమస్య ఉంటే టి.బి. యూనిట్‌కు తెలియజేయాలన్నారు. సాంక్రమిక వ్యాధి కావడంతో మరింత సమర్థంగా క్షయ నియంత్రణకు మండల యూనిట్‌తో కలిసి ప్రణాళిక రూపొందించాలన్నారు. రెండు వారాలైనా తగ్గని దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే కచ్చితంగా పరీక్షలు చేయించుకొనేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. గోమంగి పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్‌ను పర్యవేక్షించారు. బాలింతలు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు నిఖిల్, చైతన్య, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులు లేకుండా సమావేశం ఎలా?


అంపురంగి బుజ్జిబాబు, గాలికొండ ఎంపీటీసీ

సీలేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ఎలా ఏర్పాటు చేస్తారని సీపీఎం కార్యదర్శి జీకేవీధి మండలం గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు అధికార్లను ప్రశ్నించారు. సర్పంచ్ కాకూరి బుజ్జిబాబుతో కలిసి మంగళవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమే అయినప్పటికీ ఏజెన్సీలోని చాలా పాఠశాలల్లో టీచర్లు లేరని, అక్కడ సమావేశం నిర్వహించేదెవరని అంపురంగి బుజ్జిబాబు ప్రశ్నించారు.

వెలుగులో అవినీతిపై విచారణ


విచారణకు హాజరైన మహిళలు

డుంబ్రిగుడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గసభ, సోవ్వా వీవోల పరిధి గిరిజన గ్రామాల్లో జరిగిన వెలుగు అవినీతిపై స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ పంచాయతీ అధికారి కుమార్ నేతృత్వంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఆయా వీవోల పరిధిలో గసభ, మొర్రిగుడ, లోగిలి, జంగిడివలస అడ్రగడ గ్రామాల డ్వాక్రా సంఘం మహిళలు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి విచారణ అధికారిగా డీఎల్‌పీవో కుమార్‌ను నియమించారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల చెల్లింపుపై పూర్తి విచారణ చేపట్టారు. ఎస్టీ సబ్సిడీ, స్త్రీనిధి, పీఓఆర్ఎఫ్ ద్వారా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు తీసుకున్నారు. ఈ రుణాలను నెలవారీగా వెలుగు సీసీలకు చెల్లించారు. రసీదులు పొందారు. ఆయా వీవోల పరిధిలోని వెలుగు సీసీలు డ్వాక్రా సంఘాల మహిళల నుంచి తీసుకున్న నగదు మండల మహిళా సమాఖ్య ఖాతాకు చెల్లించలేదు. గతేడాది రుణాలు చెల్లించాలని డ్వాక్రా సంఘాలకు నోటీసు జారీ చేశారు. తీసుకున్న రుణాలు నెలల వారీగా రసీదు పొంది చెల్లించామని ఏపీవోలకు ఫిర్యాదు చేశారు. మండల స్థాయిలో విచారణ చేపట్టగా సుమారు రూ.12 లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. అవినీతికి పాల్పడిన సీసీలపై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు.

బదిలీపై వెళుతున్న వైద్యులు, సిబ్బందికి సన్మానం


వైద్యాధికారి వినయ్ కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీపై వెళుతున్న వైద్యాధికారులు, సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. తాజా బదిలీల్లో భాగంగా రెండేళ్లుగా ఇక్కడ వైద్యాధికారులుగా పనిచేసిన డాక్టర్ కె.వినయ్ కుమార్‌ను డౌనూరు, డాక్టర్ జె.అచ్యుత్‌ను ఉప్ప పీహెచ్‌సీకి బదిలీ చేశారు. అలాగే ఎంపీహెచ్‌ఈవో సింహాచలం కంతారం, పీహెచ్ఎన్ ద్వారకాబాయ్‌ని మాకవరపాలెం వీరితో పాటు , ఏఎన్ఎంలను పలుచోట్లకు బదిలీ చేశారు. వీరికి స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సత్కరించి వీరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటేశ్, ఎల్‌టీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేకుంటే ఫిర్యాదు చేయండి'

గూడెంకొత్తవీధి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన అజాబితాలో అర్హుల పేర్లు లేకుంటే రైతు సేవా కేంద్రంలో ఫిర్యాదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు అన్నారు. మంగళవారం ఇక్కడ వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలు గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు చెప్పారు. అర్హులైన రైతుల పేర్లు లేకుంటే ఈ నెల 13తేదీలోగా రైతు సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైసీపీ నేతల విమర్శ

అరకు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ఇక్కడి టీటీడీ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే మత్స్యలింగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో పథకాలు అనుకున్న సమయంలో అందాయన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జడ్పీ చైర్మన్ సుభద్ర, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతిదేవి, భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ స్వాతిరాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు


వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం వేదికపై వైసీపీ ప్రముఖులు

అరకులోయ, జూలై 8 (ఆంధ్రజ్యోతి):అరకులోయలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అరకులోయకు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఏజెన్సీప్రాంత వైసిపి నేతలంతా అరకులోయకు తరలివచ్చి నాలుగురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో అల్లూరి జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర , అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణి, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు, మాజీ ఎంపి గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, అనకాపల్లి జిల్లా వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శోభహైమావతిదేవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని వైఎస్ పాలనపై ప్రసంగించారు. అనంతరం నేతలంతా కలిసి కేక్‌ను కట్‌చేశారు. అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకొని నేతలంతా ఎమ్మెల్యే మత్స్యలింగం ఆధ్వర్యంలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు, జులై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ముంచంగిపుట్టులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మంగళవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబందు, పార్టీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు, నేతలు నరసింగరావు, బాబూరావు, గంగాధర్, సుబ్బలక్ష్మీ, కమల, తిరుపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెను విజయవంతం చేయాలి'

చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలపై బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో కార్మికులతో కలిసి బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులను పరిరక్షించుకునేందుకు చేపడుతున్న సమ్మెకు అందరూ మద్దతు పలకాలని కోరారు. సీఐటీయూ నాయకులు పాంగి ధనుంజయ్, కార్మిక సంఘం నాయకులు లక్ష్మణరావు, బుజ్జిబాబు, మధు, లలిత, కుమారి, ధారలక్ష్మి పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి

చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా సీహెచ్.సీతామహాలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు చింతపల్లిలో పనిచేసిన ఎంపీడీవో ఆశాజ్యోతి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో స్థానిక డిప్యూటీ ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస్‌రావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆరు నెలలు విధులు నిర్వహించారు. తాజాగా ఆశాజ్యోతిని అనకాపల్లి బదిలీ చేయగా, ఆమె స్థానంలో భీమిలికి చెందిన హనుమంతరావును ఎంపీడీవోగా జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి నియమించారు. హనుమంతరావు విధుల్లోకి చేరకుండగానే సెలవుపై వెళ్లారు. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాస్‌రావును అచ్యుతాపురం బదిలీ చేశారు. దీంతో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న సీతామహాలక్ష్మికి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. దిగువ స్థాయి ఉద్యోగులను పంపకుండా అధికారులే సమావేశానికి రావాలన్నారు.

దోమల నివారణకు ముమ్మరంగా పిచికారీ

అనంతగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండోవిడత 242 గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ పనులు ప్రారంభించామని సబ్ యూనిట్ అధికారి బి.బాబురావు మంగళవారం తెలిపారు. మండలంలోని స్థానిక పీహెచ్‌సీ పరిధిలోగల హెక్టగుడ వద్ద వైద్యాధికారిణి జ్ఞానేశ్వరీ, పినకోట పీహెచ్‌సీ పరిధిలోని తీగలబంధలో వైద్యాధికారి రూప్‌చంద్, భీమవరం పీహెచ్‌సీ పరిధిలోని సింగవరంలో వైద్యాధికారి శ్రీనివాస్‌లు పిచికారీ ప్రారంభించారు. ఇంటిలోపల స్ప్రేయింగ్ చేయించుకుంటే దోమలు నివారించవచ్చునని, మురుగునీరు నిల్వలేకుండా చూడాలని సూచించారు. మలేరియా సూపర్‌వైజర్ దాలన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు ఏడీగా బొంజుబాబు



చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్‌గా లకే బొంజుబాబు నియమితులయ్యారు. కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అప్పలనాయుడు ఇటీవల పదవి విరమణ పొందారు. దీంతో కాఫీ ప్రాజెక్టు ఏడీ పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో ఐటీడీఏ అధికారులు అరకులోయ పద్మాపురంగార్డెన్ ఉద్యానశాఖ అధికారిగా పనిచేస్తున్న బొంజుబాబుని ఏడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఆయన విధుల్లో చేరారు.

ఉద్యాన పంట సాగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


మొక్క నాటుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంట సాగుపై గిరిజన రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మంగళవారం చిలకలమామిడి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం సిబ్బంది రైతు పంట పొలాల్లో 2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి వన్‌డే ఓరియంటేషన్ ఉద్యాన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ గిరిజన రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉద్యాన మొక్కలను పంపిణీ చేసి మూడేళ్ల పాటు ప్రోత్సాహక నిధులు అందించడం జరుగుతుందన్నారు. 17 పంచాయతీల్లో పది మొక్కల ఉద్యాన మొక్కలు రైతులకు పంపిణీ చేస్తున్నారన్నారు. రైతులు మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏపీవో రాజు, సర్పంచ్ దురియా పుష్పలత, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

'పొలం పిలుస్తోంది'ని వినియోగించుకోండి

▸▸ జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు

మాకవరపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు అన్నారు. మండలంలోని నారాయనరాజుపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పచ్చి రొట్ట ఎరువులు, నారుమళ్లను పర్యవేక్షించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జనుము, జీలుగు, పిల్లిపెసరతో పాటు నవధాన్యాలు వల్ల రసాయన ఎరువులు ఖర్చు తగ్గుతుందన్నారు. దీనివల్ల భూసారం కూడా పెరుగుతుందన్నారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట ఏడీ ఉమాప్రసాద్, ఏవో అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

టేకు కలప వేలంతో ప్రభుత్వానికి ఆదాయం

▸▸ నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్


టేకు వేలం పాటలో పాల్గొన్న సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్

గొలుగొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): టేకు కలప వేలం పాట ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు కృషి చేస్తున్నట్టు నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని గొలుగొండలో మంగళవారం టేకు కలప వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ భూముల్లో సాగు చేసిన టేకు ప్లాంటేషన్లలో టేకు కలపను డిపోల ద్వారా వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది టేకు కలప వేలం పాట ద్వారా రూ.3 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ, అటవీ శాఖ భూముల్లో ఈ సీజన్‌లో సుమారు ఆరు లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రేంజర్ శ్రీనివాసరావు, డిపో ఇన్‌చార్జి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

కృష్ణాదేవిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న నాణ్యమైన పశుగ్రాస విత్తనాల గడ్డితో పాడి పశువుల నుంచి అధిక పాల దిగుబడి సాధించవచ్చని కృష్ణాదేవిపేట, గొలుగొండ ప్రభుత్వ పశు వైద్యాధికారులు శిరీషా, దుర్గాప్రసాద్ తెలిపారు. ఏఎల్‌పురం, గొలుగొండ, చోద్యం తదితర గ్రామాల్లో మంగళవారం పశుగ్రాస సాగు భూములను సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు వారు అవగాహన కల్పించారు. నాణ్యమైన పశుగ్రాసాల వల్ల పశువులకు అన్ని రకాల పోషకాలు అందుతాయని, తద్వారా ఆరోగ్యంగా ఎదుగుతాయని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో 75 శాతం రాయితీలో పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం రైతులకు గడ్డి విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నతోనే నియోజకవర్గ అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులపై కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు

నర్సీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గం అభివృద్ధి స్పీకర్ అయ్యన్నపాత్రుడుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ.311 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. రూ.42.29 కోట్లుతో గుంతలు లేని రోడ్లు నిర్మించామని చెప్పారు. గత ప్రభుత్వంలో అధ్వానంగా వదిలేసిన రోడ్లు, ప్రస్తుత రోడ్లు పరిస్థితి వీడియో రూపంలో చూడాలంటే కరపత్రంలోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని కోరారు. తాండవ జలాశయం గేట్లు మరమ్మతులు, ఇతర పనులకు రూ.210 కోట్లు, ఎడమ కాలువ పూడిక తీత పనులకు అదనంగా మరో రూ.1.5 కోట్లు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. రూ.1.1 కోట్లుతో సాగునీటి సమస్య పరిష్కరించారన్నారు. దీనివల్ల 6050 ఎకరాలకు లబ్ధి చేకూరిందన్నారు. మునిసిపాలిటీలో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.1.17 కోట్లతో పారిశుధ్య వాహనాలు కొనుగోలు చేసినట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేసిన వీధి లైట్లు రూ.8.66 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో పింఛన్లు 41,350 మందికి ప్రతి నెలా రూ.17.49 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ.35 కోట్లతో ఆర్థికంగా ఆసరా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర, టీడీపీ గొలుగొండ మండల అధ్యక్షుడు అడిగర్ల నానిబాబు, కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధుబాబు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూములను పరిశీలించిన బీడీఎల్ బృందం


భూములను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాచపల్లి రెవెన్యూ రామన్నపాలెం గ్రామానికి ఆనుకొని ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూములను బీడీఎల్ కంపెనీ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ఏపీఐఐసీ భూములతో పాటు ప్రభుత్వ భూముల పరిశీలన చేశారు. భూములతో పాటు రోడ్డు విస్తీర్ణం, ప్రస్తుతం నిర్మిస్తున్న కొత్త రోడ్డు, భవిష్యత్తులో రైల్వే ట్రాక్‌కు సంబంధించి స్థలాల గురించి మాకవరపాలెం తహసీల్దార్ వెంకటరమణ కంపెనీ బృందం సభ్యులకు తెలిపారు. అయితే పూర్తి నివేదికను బీడీఎల్ కంపెనీ యాజమాన్యం ప్రతినిధులకు పంపించిన తరువాత తుది నిర్ణయం ప్రకటిస్తారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మాకవరపాలెం రామన్నపాలెం సెంటరు నుంచి యలమంచిలి నియోకవర్గం పెదపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న ఎన్‌హెచ్-16 రోడ్డుకు ఈ మార్గాన్ని కలుపుతున్నట్టు ఏపీఐఐసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అల్లు రామునాయుడు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పండ్ల తోటలతో ఆర్థికాభివృద్ధి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర

నాతవరం. జూలై 8 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర చెప్పారు. మండలంలోని చెర్లోపాలెం గ్రామంలో ఎంపీడీవో ఉషశ్రీతో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మర్రిపాలెంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాతవరంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, విజయ్ కుమార్, అపిరెడ్డి మాణిక్యం మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దాసరి కొండాజీ పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు

నర్సీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కళాశాలలు, పాఠశాలలకు దగ్గరలో గుట్కా విక్రయాల నియంత్రణకు పట్టణ, రూరల్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎస్‌ఐ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది దుకాణాలను తనిఖీ చేశారు. రూరల్ సీఐ రేవతమ్మ గబ్బాడ, నీలంపేట, చెట్టుపల్లి గ్రామాల్లో తనిఖీలు చేశారు. విద్యా సంస్థలకు వంద మీటర్ల పరిధిలో గుట్కాలు, ఖైనీలు విక్రయించకూడాని చెప్పారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట గ్రామాల్లో దుకాణాలను ఎస్‌ఐ తారకేశ్వరరావు తనిఖీలు చేపట్టారు. ఖైనీలు, గుట్కాలు వల్ల జరిగే అనర్థాలు, విక్రయిస్తే తీసుకునే చర్యలను దుకాణ యజమానులకు ఎస్‌ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు గురుమూర్తి, నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు



తెనుగుపూడిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బూడి... నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు


చోడవరంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

నర్సీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేపట్టిన కార్యక్రమాలను కొనియాడారు. అలాగే పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతి నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్ఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.సన్యాసిపాత్రుడు, చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. అలాగే కాపువీధిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నంగిన రమణ, సమన్వయకర్త చినబాబు, సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: చోడవరంలోని కొత్తూరు జంక్షన్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, డీవీఆర్, బైన ఈశ్వరరావు, దేవరపల్లి సత్య, నెహ్రూ పాల్గొన్నారు.

దేవరాపల్లి: తెనుగుపూడిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేకు కట్ చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎ.కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ, కొత్తపెంటలో సర్పంచ్ ఎన్.వెంకటరావు, జెడ్పీటీసీ కె.సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల బస్టాండ్‌లో వైఎస్ విగ్రహానికి ఎంపీపీ రాజారాం పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు మాడుగుల బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది, బుచ్చెయ్యపేట, తురకలపూడి, వీఆర్‌ఆర్‌పేట గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతి నిర్వహించారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట: మండలంలోని గొలుగొండ, జోగంపేట, చీడిగుమ్మల, కొత్తమల్లంపేట, ఏటిగైరంపేట గ్రామాల్లో జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె.ఫాణిశాం రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం గొలుగొండ పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు అందించారు. ఏఎల్‌పురం, సిహెచ్.నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైసీపీ నేత లోచల సుజాత వైఎస్సార్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎల్.అప్పలనాయుడు, ఎల్.సత్యనారాయణ, పి.రమణ, చిటికెల భాస్కరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి తోడ్పాటు: ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు


రాయపురాజుపేటలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు అన్నారు. మంగళవారం మండలంలోని రాయపురాజుపేటలో ఉపాధి శాఖ ఆధ్వర్యంలో పండ్లతోటల పెంపకం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడుతూ, పేదలకు ఆసరాగా ఉపాధి నిధులతో ఉచితంగా పండ్లతోటల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పథకం ఏపీవో చంద్రకళ మాట్లాడుతూ 59 ఎకరాల్లో 3,680 మంది రైతులతో పండ్ల తోటలను పెంచనున్నట్లు తెలిపారు. 19 రకాల పండ్ల మొక్కలు అందచేస్తామని, మూడేళ్ల నిర్వహణకు రూ.70 వేల నుంచి రూ.లక్షన్నర వరకూ ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. పూలసాగుకు మూడేళ్లకు రూ.6.46 లక్షల సాయం అందుతుందన్నారు. తైవాన్ జామ పెంపకానికి రూ.5.6 లక్షలు, మునగ పెంపకానికి రూ.లక్షన్నర సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతుల పొలాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఎంపీడీవో పీఎస్‌జే ఆంజనేయులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, స్థానిక సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు, కార్యదర్శి నారాయణరావు, ప్లాంటేషన్ మేనేజర్ బి.సురేష్, సూపర్‌వైజర్ శ్రీను పాల్గొన్నారు.

గొండుపాలెంలో..

కె.కోటపాడు: గొండుపాలెం పంచాయతీలో ఎంపీడీవో సాంబశివరావు మొక్కలు నాటారు. పండ్ల తోటల పెంపకం కోసం ఆసక్తి గల రైతులు ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కె.కోటపాడు మండలంలోని 18 పంచాయతీల్లోని 48.5 ఎకరాల్లో మొక్కలు నాటామన్నారు. ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సొంత నిధులతో రహదారికి మరమ్మతులు


రోలుగుంటలో గోతులు పూడ్చివేయిస్తున్న దృశ్యం

రోలుగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోలుగుంటలో పూర్తిగా దెబ్బతిన్న బీఎన్ రోడ్డుకు 'మన ఊరు-మన బాధ్యత' నినాదంతో ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ సొంత డబ్బుతో మరమ్మతులు చేయించేందుకు ముందుకు వచ్చారు. ఈ రోడ్డుపై గుంతలను మంగళవారం పీఏసీఎస్ నుంచి పోలీసు స్టేషన్ వరకు పూడ్చించారు.

గుండెపోటుతో టీడీపీ యువనాయకుడు మృతి


బండారు శ్రీను (ఫైల్)

దేవరాపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చిన నందిపల్లి ఉపసర్పంచ్, తెలుగుదేశం యువ నాయకుడు బండారు శ్రీనివాస్(36) మంగళవారం హఠాన్మరణం చెందారు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఈ యువ నాయకుడికి వేకువజామున ఛాతిలో నొప్పి రావడంతో హుటాహుటిన విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అన్నారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. మాజీసర్పంచ్ పూడిసత్యారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తాం

▸▸ సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజలతో ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు


చీమలపాడులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

రావికమతం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని చీమలపాడు, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం గ్రామాల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామన్నారు. జెడ్.కొత్తపట్నం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, రుచి ఎలా ఉంటోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తకోటలో ఎమ్మెల్యే రాజు పలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'లో రైతులకు సలహాలు

బుచ్చెయ్యపేట జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజాం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి భాస్కరరావు పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకుని రైతులకు సూచనలు, సలహాలు అందించారు. నారు మడులు పోసేటప్పుడు రైతులు తీసుకోవలసిన చర్యలు, భూసారం పెంపునకు సలహాలు అందించారు. కౌలు రైతులు కార్డులు పొందడానికి కావలసిన అర్హతలను వివరించారు. ఎంపీవో సంతోష్, రైతులు పాల్గొన్నారు.

డెంగ్యూ రాకుండా ముందస్తు జాగ్రత్తలు మేలు


కొత్తకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, సిబ్బంది

రావికమతం/దేవరాపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం మంచిదని కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సురేఖ అన్నారు. మంగళవారం వైద్య సిబ్బందితో కలసి ఆమె గ్రామంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆవాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. అనంతరం కొత్తకోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శారీరక కొలతలు నమోదు చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌ఎస్ రమణమ్మ, హెచ్‌వీ ఉర్రమ్మ పాల్గొన్నారు. ఈడిస్ దోమ వలన డెంగ్యూ వ్యాధికి గురవుతారని, పరిశుభ్రత పాటిస్తే సరిపోతుందని దేవరాపల్లి వైద్యాధికారిణి పూజిత మేఘన అన్నారు. సీహెచ్‌ఓ ఆనంద్, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సమ్మెను విజయంతం చేయాలి'


చోడవరంలో సంఘ నాయకుల బైక్‌ర్యాలీ

చోడవరం/రోలుగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా బుధవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ, మంగళవారం చోడవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్‌కు సహకరించాలని నినాదాలు చేశారు. శ్రీనివాసరావు(సీఐటీయూ), లోవరాజు(ఎల్ఐసీ), అప్పారావు, కల్యాణ్, మోహన్, శంకరరావు, గణేశ్, ప్రేమచంద్రశేఖర్ (బేస్ యూనిట్) పాల్గొన్నారు. సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నామని ఆశ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డాన రామలక్ష్మి తెలిపారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారికి సమ్మె నోటీసు అందచేశారు. రోలుగుంట మండలం బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం ఆరోగ్య కార్యకర్తలు కూడా సమ్మె నోటీసును అందించారు. మండల సీఐటీయూ నాయకుడు ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. ఆశ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని కోరారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ


ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాడుగుల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో మోదకొండమ్మ అమ్మవారి ఘటాల పండుగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. నెత్తిన ఘటాలు పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మోదమాంబ కాలనీకి చెందిన జి.మణిస్వామి, మణిమాల దంపతులు పండుగను నిర్వహించారు. సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ వరహాలరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు నాయకులు పాల్గొన్నారు.

ముషిడిపల్లిలో పైడితల్లమ్మ ఉత్సవం


పైడితల్లమ్మ పండగలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి, జూలై8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ముషిడిపల్లి గౌరీ కాలనీలో పైడితల్లమ్మ ఒడ్డుపండగ మంగళవారం ఘనం చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. మాజీసర్పంచ్‌లు సోమిరెడ్డి గోవింద, బొడ్డు చినవెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

14 వరకు పశుగ్రాస వారోత్సవాలు

కె.కోటపాడు/మాడుగుల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కె.కోటపాడులో ఆయన రైతులతో మాట్లాడుతూ సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ఐదు నుంచి ఆరు లీటర్ల పాలిచ్చే పశువులకు దాణా అవసరం లేకుండా కేవలం పచ్చిమేతతోనే పోషణ చేపట్టవచ్చునని తెలిపారు. మాడుగుల మండలం కేజేపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పశు వైద్యాధికారి శివకుమార్ రైతులకు పశుగ్రాసం వివరాలు తెలియజేశారు. రాయితీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నామని మాడుగుల సహాయ సంచాలకుడు చిట్టినాయుడు తెలిపారు. మేలైన పోషణ అందివ్వడానికి మొక్కజొన్న, జొన్న, అలసందలు, పిల్లి పెసరను పశుగ్రాసంగా పెంచుకోవాలని సూచించారు.

కౌలు రైతులు కార్డులను విధిగా తీసుకోవాలి

దేవరాపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కార్డు విధిగా తీసుకోవాలని చోడవరం సబ్‌డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాకుడు వి.రవీంద్రనాథ్ సూచించారు. అన్నదాత సుఖీభవ పి.ఎం.కిసాన్ పేర్లు రానివారు తనిఖీ చేయించుకోవాలన్నారు. నాగయ్యపేట, సమ్మెద గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అవగాహన కలిగించారు. లోపాలు సరి చేసుకొనేందుకు ఈ నెల 10 వరకు అవకాశం ఉందన్నారు.

షిర్డీసాయి ఆలయాల్లో రేపు గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

మాడుగుల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక షిర్డిసాయి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సాయి సేవా ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేకువజాము 5 గంటల నుంచి నగర సంకీర్తన, కాకడ హారతి, మృత్యుంజయ హోమం, పంచామృతాభిషేకం అనంతరం అభిషేకాలు, షిర్డిసాయి సత్యవ్రతాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారికి హారతి, 12:30 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి విష్ణు సహస్రనామ పారాయణం. సాయంత్రం 5 గంటలకు పల్లకి ఉత్సవం, రాత్రి 7:30 గంటలకు షిర్డిసాయి నామ సంకీర్తన అనంతరం హారతి, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మద్దుల సత్యనారాయణ, వైస్ చైర్మన్ నాగ రమేష్‌బాబు, గౌరవ అధ్యక్షుడు శ్రీనాథ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు దొడ్ల సుబ్బారత్నం, రమేష్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

కె.కోటపాడులో లక్ష యాలకులతో అర్చన

కె.కోటపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. లక్ష యాలకులతో సాయిబాబాకు ప్రత్యేక అర్చన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహిస్తామన్నారు.

'కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి'

మాడుగుల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల లీగల్‌సెల్ కన్వీనరు శ్రీనాధు ప్రసాదరావు కోరారు. వీరనారాయణంలో మంగళవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన, గర్భిణులకు పౌష్టికాహారం, ఉజ్వల యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠస్వామి, గణేశ్, వరహాలనాయుడు పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణకు సిద్ధమైన స్వామివారి రథం



వెంకోజీపాలెం వద్ద జాతీయ రహదారిపై భక్తులు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బారికేడ్లు



సింహాచలం కొండపై ఏర్పాట్లు చేసిన క్యూలైన్లు

రూ.100లకు కోనసీమ కొబ్బరి మొక్క

» ప్రైవేటు నర్సరీలలో మొక్క రూ.300

» సోషల్ ఫారెస్టు నర్సరీలో సరసమైన ధరలకు విక్రయం



కోనసీమ కొబ్బరి మొక్కలు లోడ్ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ సామాజిక వన విభాగం నర్సరీలో రూ.100లకే కోనసీమ కొబ్బరి మొక్కలు విక్రయిస్తున్నారు. ప్రైవేటు నర్సరీలలో దీని ధర రూ.300 ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రైతులకు నిర్ణీత ధరకు విక్రయిస్తున్నారు. సోషల్ ఫారెస్టు ఆధ్వర్యంలో 2022 నుంచి నర్సీపట్నం కలప డిపో ఆవరణలో అల్లూరి వన నర్సరీ పేరుతో మొక్కలు విక్రయిస్తున్నారు. మొదట్లో తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి తీసుకువచ్చేవారు. అక్కడ నుంచి తీసుకు వచ్చి సోషల్ ఫారెస్ట్ నర్సరీలో విక్రయించడం వలన ధర తగ్గించి ఇవ్వడానికి వీలు పడేది కాదు. దీంతో నర్సరీలోనే విత్తనాలు వేసి మొక్కలు పెంచి విక్రయించడం మొదలు పెట్టారు. దీని వలన ప్రైవేటు నర్సరీల కంటే తక్కువ ధరలకు విక్రయించడానికి వీలుపడుతుంది. కొబ్బరి మొక్కలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ఎర్రచందనం, శ్రీగంధం, మహాగణి, రోజ్ ఉడ్ మొక్కలు రూ.46 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ మొక్కలు ప్రైవేటు నర్సరీలలో రూ.100లకు పైగా విక్రయిస్తున్నారు. నీడనిచ్చే రకాలు కానుగ, తెల్లమద్ది, వేప, బాదం, కొండమామిడి, పనస మొక్కలు 38లకు విక్రయిస్తున్నారు. ప్రైవేటు నర్సరీలు కంటే ఇక్కడ ధరలు అనుకూలంగా ఉండడంతో స్థానికులు కొనుగోలు చేస్తున్నారు.

సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి ఉద్యోగులంతా కృషి చేయాలి

» వ్యవస్థాపక దినోత్సవంలో సంస్థ ఈడీ సమీర్‌శర్మ



కేక్ కట్ చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి ఉద్యోగులంతా శక్తివంచన లేకుండా కృషి చేయాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ 28వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం స్థానిక అడ్మిన్ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ విద్యుదుత్పత్తిలో సింహాద్రికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉద్యోగులు అహర్నిశలు శ్రమించడం వల్లే నాణ్యమైన విద్యుదుత్పత్తిని తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు ఆయన జెండా ఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఓఅండ్ఎం విభాగం సీజీఎం పీకే జనా, వివిధ విభాగాల ఏజీఎంలు, సీజీఎంలు, ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో అద్భుత ప్రతిభను కనబరిచిన చిన్నారులకు ఈడీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు.

సింహగిరి ప్రదక్షిణ.. భూప్రదక్షిణతో సమానం

» కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

భారతీయ సంస్కృతికి మూలం వేదాలు. వేదం ప్రకృతిని పరమాత్మ స్వరూపంగా చెప్పింది. అందుకే అనాదిగా భారతీయులు చెట్లను, పుట్టలను, నదులను, సముద్రాలను, పర్వతాలను పూజిస్తుంటారు. పర్వతాలకు భూధరాలని పేరు. అంటే భూమి ధరించేవని అర్థం. వేదాల ప్రకారం విష్ణుః పర్వతానాం అధిపతిః. అందుకే పర్వతాలు పూజించబడుతున్నాయి. భూమి సమతుల్యతను కాపాడేవి పర్వతాలు. సాధారణంగా స్వయంభువుడుగా భగవానుడు వెలసిన క్షేత్రాలన్నీ అధికశాతం పర్వతాలపైనే ఉంటాయి. అదే పర్వతాలపై పురాణాల కాలంలో మునులు, యోగులు తపస్సులు చేసి జ్ఞానసముపార్జన చేశారు. అటువంటి అనేక దైవీ భావనలు ఉండడం చేతనే పర్వతాలను పూజించడం, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వేదకాలం నుంచే జరుగుతున్నట్టు విజ్ఞులు చెబుతారు. వరాహ లక్ష్మీనృసింహస్వామి ద్వయావతారుడుగా వెలసిన దివ్యధామం సింహగిరి. అందుకే సింహగిరి చుట్టూ ప్రదక్షిణం చేయడం భూ ప్రదక్షిణతో సమాన ఫలితాన్ని ఇస్తుందని చెబుతారు. సింహగిరి చుట్టూ ప్రదక్షిణలు చేసిన వారికి విద్యాభివృద్ధి, ఉద్యోగప్రాప్తి, వివాహ అనుకూలత వంటివి ఈడేరుతాయని పెద్దలు చెబుతుంటారు. కోర్కెలు లేకుండా సింహగిరి ప్రదక్షిణ చేసినవారు ఇహపర సౌఖ్యాలు పొందుతారని పండితుల మాట. భౌతికంగా సింహగిరి చుట్టుకొలత 32 కిలోమీటర్లు. సింహాచల క్షేత్ర మహత్యం ప్రకారం హిరణ్యకశ్యపుని సంహరించే సమయంలో విష్ణువు 32 రూపాలు ధరించాడని, అదేవిధంగా నృసింహస్వామి మూలమంత్రంలో 32 బీజాక్షరాలు ఉన్నాయని అందుకే 32 కిలోమీటర్ల వ్యాసార్థం కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత ఫలాన్ని ఇస్తుందని అంటారు.

గురుపౌర్ణమిగా నాడే సింహగిరి ప్రదక్షిణ ఎందుకు చేయాలంటే..వేదవ్యాసుడు వేదాలను విభజించి మానవాళికి గురువుగా పూజించబడుతున్నాడు. భగవానుడి తత్వాన్ని విశ్వానికి తెలిపిన వ్యాసుడు జయంతికి ప్రత్యేకత ఉంది. గురువు అంటే పెద్దది, విశ్వం అని అర్థాలు ఉన్నాయి. ఏటా వైశాఖమాస శుక్లపక్ష తదియ, పౌర్ణమి, జేష్ఠ, ఆషాడ పౌర్ణమిలలో నాలుగు విడతలుగా చందనాన్ని పైపూతగా సమర్పించడంతో సింహాద్రినాథుడు గురు(పెద్ద) రూపం సంతరించుకుంటాడు. అందుకే వ్యాసపూర్ణిమనాడు గిరి ప్రదక్షిణ చేస్తారని సింహాద్రి అప్పన్న ఆలయ స్థానాచార్యులు తెలిపారు.

ఏటికొప్పాక హస్త కళారంగానికి మరింత చేయూత

» జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్. చిత్రంలో ఎమ్మెల్యే విజయకుమార్ ఉన్నారు.

ఎలమంచిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక హస్త కళారంగానికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మంగళవారం ఏటికొప్పాక గ్రామంలో ఉన్న హస్త కళాకారులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే విజయకుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హస్త కళాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా హస్తకళలకు ఉపయోగించే అంకుడు కర్ర సేకరణలో ఆంక్షల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాకారులు తెలిపారు. గ్రామంలో కళాకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ కళాకారులు ఆధునికతను అందిపుచ్చుకోవాలని కోరారు. సాంకేతికతకు అనుగుణంగా హస్త కళారంగాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా కళాకారులు కలెక్టరు, ఎమ్మెల్యేలకు అంకుడు కర్ర కళాఖండాలను అందజేశారు. మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి కళాకారుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, కూటమి నేతలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, రాజాన శేషు, ఎంపీడీఓ కొండలరావు, వెలుగు ఏపీఎం రాణి పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మంత్రి, అనకాపల్లి కలెక్టర్



మంత్రి అనితకు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో



కలెక్టర్ విజయకృష్ణన్‌కు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

సింహాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి):

సింహాద్రి అప్పన్న స్వామిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. మంత్రి కి ఈవో వి.త్రినాథరావు, కలెక్టర్‌కు పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నాక వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను వారికి అందజేశారు.

లవ్ సింబల్‌లో లక్ష్మణ ఫలం



లవ్‌సింబల్ ఆకారంలో ఉన్న లక్ష్మణ ఫలం

చోడవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీతాఫలం, రామాఫలం అందరికీ పరిచయమే. కానీ లక్ష్మణఫలం ఎలా ఉంటుందనేది కొద్ది మందికి మాత్రమే తెలిసుంటుంది. లక్ష్మణఫలం చాలా వరకూ కోలగా ఉంటుంది. అయితే పట్టణ శివారు గోవిందమ్మకాలనీ వెనుకన ధర్మతేజరెడ్డి పొలంలో వేసిన పండ్ల తోటలో లక్ష్మణఫలాలు కాశాయి. ఈ కాసిన లక్ష్మణ ఫలం లవ్‌సింబల్ గుర్తులో ఉండడం విశేషం. లవ్‌సింబల్‌లో ఉన్న ఈ పండును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ ఫలాన్ని పరిశీలించిన స్థానిక ఏడమ్స్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు బద్రిమహంతి పూర్ణిమ మాట్లాడుతూ, లక్ష్మణ ఫలం శాస్త్రీయ నామం అన్నోనా మ్యూరికాటా అని, ఒక అండంతో రెండు మగ కణాలు సంయుక్తం చెందినపుడు ఈ విధంగా పండ్లు వింత ఆకృతులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ రోగులకు లక్ష్మణ ఫలం చక్కని ఔషధంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ పండు ను ఏడమ్స్ పాఠశాల విద్యార్థుల కోసం పాఠశాలలో ఉంచారు.

సింహగిరికి ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

32 ప్రాంతాల్లో 200 వాట్స్ సామర్థ్యం కలిగిన హైమాస్ట్ లైట్లు పెట్టారు. కొండ పైకి వెళ్లేందుకు 50 బస్సులను ఉచిత సర్వీస్‌లుగా నడుపుతున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం రాత్రి సింహాచలం వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అప్పుమర్ వద్ద ఏర్పాట్లు తనిఖీ చేశారు.

గిరి ప్రదక్షిణ సందర్భంగా బుధ, గురువారాల్లో దేవస్థానంలో నిత్యకల్యాణం, సుప్రభాత సేవ, ఆరాధనసేవ, అష్టోత్తర, సహస్రనామార్చన వంటి ఆర్జిత సేవలు రద్దు చేశారు. అదేవిధంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు రోజులు నీలాద్రి గుమ్మం వద్ద నుంచి అప్పన్న దర్శనాలు కల్పించనున్నారు.

పదో తేదీన...

పదో తేదీ తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలుపుతారు. 2.30 గంటల నుంచి 4 గంటల వరకూ మూడు మణుగుల చందనం సమర్పిస్తారు. 4 నుంచి ఐదు గంటల వరకు ప్రభాత ఆరాధన, బాలభోగం, రాజభోగాల నివేదనలు కావిస్తారు. ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ నిరంతరాయంగా భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.00 గంటల వరకూ పవళింపుసేవ, ఢిల్లీ విజయం ఉత్సవం జరుగుతాయి. ఈ కారణంగా మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనాలు ఉంటాయి. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకకూ రాత్రి ఆరాధన (భక్తులకు దర్శనాలు లభించవు), 9 గంటలకు పవళింపుసేవ ఉంటాయి. అనంతరం కవాట బంధనం చేస్తారు.

కాగా, పదో తేదీ ఉదయం మూడు గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. భక్తుల సౌకర్యార్థం కార్పెట్లు పరచి, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రదక్షిణ చేసే భక్తుల వల్ల సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఉత్తర, దక్షిణ రాజగోపురాల వద్ద రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటుచేశారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కశింకోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ కె.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 3వ తేదీన కశింకోట గ్రామీణ వికాస బ్యాంకు సమీపంలో జాతీయ రహదారిపై తేగాడ గ్రామానికి చెందిన మామిడి బాబూరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబూరావును అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని మృతుడి భార్య మామిడి చిన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గడ్డి మందు తాగి గృహిణి మృతి

అచ్యుతాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగి మహిళ మృతి చెందిదని ఎస్ఐ సుధాకరరావు తెలిపారు. భోగాపురం పరిధిలో నివాసముంటున్న హేమ లక్ష్మి (32) కుటుంబ కలహాలు కారణంగా ఈనెల ఆరున గడ్డి మందు తాగింది. వెంటనే ఆమెను విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆమెకు హేమవర్ధన్, లోహిత అనే ఇద్దరు పిల్లలున్నారు.

యువకుడిపై కత్తితో దాడి



కత్తిపోట్లుకు గురైన కె.రమణ

నాతవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ భీమరాజు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాతవరం చికెన్ సెంటర్ వద్ద కె.రమణ, పి.శివ గొడవ పడ్డారు. ఈ గొడవతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో రమణ అనే వ్యక్తికి కత్తిపోట్లుతో గాయాలయ్యాయి. గాయపడిన రమణను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు.

కేకే లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు

విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) లైన్‌లో రైళ్ల పాక్షిక రద్దు, గమ్యాల కుదింపు కొనసాగుతోంది. కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను పాక్షికంగా రద్దు చేశామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) ఈ నెల 10న (గురువారం) విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) ఈనెల 11న (శుక్రవారం) కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖ వరకూ నడుస్తుంది. కోరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈనెల 10న విశాఖలో బయలుదేరి కోరాపుట్ వరకూ, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ (58502) కోరాపుట్‌లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కోరాపుట్, కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు.

హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (18005) ఈనెల 8 నుంచి 10 వరకు హౌరాలో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో (18006) ఈనెల 10 నుంచి 12 వరకు కోరాపుట్‌లో బయలుదేరి హౌరా చేరుతుంది. ఈ సర్వీసులకు కోరాపుట్-జగదల్‌పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. ఇక భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18447) ఈనెల 10 వరకు భువనేశ్వర్‌లో బయలుదేరి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్-భువనేశ్వర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ (18448) కోరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది.

ప్రసూతి సేవల్లో పురోగతి

... 5వ పేజీ తరువాయి

చేశారు. 2025 జనవరి నుంచి జూన్ వరకు 1,475 ప్రసవాలు చేయగా, 852 సుఖ ప్రసవాలు, 623 సిజేరియన్‌లు చేశారు. రిఫరల్ కేసులు 50 మాత్రమే ఉన్నాయి.

గైనికాలస్టులు, మత్తు డాక్టర్ అవసరం

ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం ముగ్గురు గైనికాలజిస్టులు ఉన్నారు. వీరిలో డాక్టర్ లక్ష్మణరావు ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రికి నలుగురు గైనికాలజిస్టులు అవసరం ఉంటుంది. అలాగే మత్తు డాక్టర్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో మంగళవారం చోడవరం నుంచి, బుధ, శుక్రవారాలలో కోటవురట్ల సీహెచ్‌సీ నుంచి మత్తు డాక్టర్‌ని రప్పిస్తున్నారు.

డాక్టర్ పోస్టులు పెంచాలి



ఏరియా ఆస్పత్రిలో ఇద్దరు గైనికాలజిస్టులు ఉన్నారు. మరో ఇద్దరు గైనికాలజిస్టులు, ఒక మత్తు డాక్టర్ అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న 150 నుంచి 200 బెడ్లు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. దీని వలన డాక్టర్లు, సిబ్బంది పోస్టులు పెరుగుతాయి. ప్రసూతి విభాగంలో సౌకర్యాలు మెరుగుపరుస్తాం.

- డాక్టర్ సుధాశారద, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

23 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ఇప్పటి వరకు ఆరు వేల టన్నుల యూరియా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాలకు అందించామన్నారు. మిగిలినవి కూడా అందిస్తామన్నారు. 1,101 మంది రైతులకు రాయితీపై రూ.6 కోట్ల విలువైన పనిముట్లు అందజేశామన్నారు. డ్రోన్‌లు 11 మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 7 ఇచ్చామని తెలిపారు. మిగిలినవి త్వరలో అందజేస్తామన్నారు. ఈ నెల 11న పెదబొడ్డేపల్లిలో జరిగే యాంత్రీకరణ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వైస్ చైర్మన్ చిటికెల కన్నయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో గోతుల పూడ్చివేత

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఈ రోడ్డు దుస్థితిని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఈఈలను చూపించి కాంట్రాక్టర్ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సోమవారం ఈ రోడ్డు దుస్థితిపై చోడవరం న్యాయవాదులు కోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆర్‌అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్ దిగి వచ్చి మంగళవారం గోతులు పూడ్చే పనులు చేపట్టారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ మాడుగుల సెక్షన్ ఏఈ సాయిశ్రీనివాస్‌ను సంప్రతించగా బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట నుంచి రావికమతం మండలం టి.అర్జాపురం వరకు తన పరిధిలో భారీ గోతులన్నీ పూడ్చి రోడ్డు మెటల్ పరిచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఈ రోడ్డు ధ్వంసంపై ఆందోళనలు చేసినప్పుడల్లా ఎక్కడో చోట చిన్నపాటి పనులను మొక్కుబడిగా చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544